మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



## భూసేకరణను యుద్ధప్రాతిపదికన

# పూర్తి చేయాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..**



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువలు, రిజర్వాయర్ పనులకు ఇరిగేషన్ శాఖకు అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భూసేకరణ, ఇరిగేషన్ రెవెన్యూ అధికారులతో భూసేకరణ పై సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలు అయ్యింది అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. బండ్రాయపాకుల, కానాయపల్లి పునరావాస కేంద్రాల పురోగతి పై సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాలకు తరలించడానికి అవసరమైన స్థలాన్ని సేకరించి లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. గణసముద్రం రిజర్వాయర్ కు సేకరించాల్సి న స్థలానికి అవార్డు పాస్ చేయాలని సూచించారు. తెల్లారాళ్ళ పల్లి, బొల్లారం, శాపూర్, మామిడిమాడా, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెగ్మార్క్ చేసిన భూమికి త్వరగా అవార్డులు సిద్ధం చేయాలని ఆదేశించార. వనపర్తి పట్టణ బాహ్య వలయం రోడ్డుకు అవసరమైన భూసేకరణ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పి.ఎన్ పాస్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ పద్మావతి ఇరిగేషన్ ఎస్. ఈ కేశవరావు, ఈఈ మధుసూదదన్, డి.ఈ.లు తహసిల్దార్ కేషన్ నాయక్, ఏ డి సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు.

# పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ..

**- సోలార్ కేబుల్ వైర్ల దొంగతనం కేసులో**

**మరో ముగ్గురు అరెస్ట్ - రూ.4.50లక్షల రికవరీ..**

**- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు**




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**జడ్చర్ల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :** సోలార్ కేబుల్ వైర్ల చోరీ కేసులో మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. శుక్రవారం జడ్చర్లలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, మిడ్జిల్ ఎస్సై శివనాగేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో మిడ్జిల్ మండలం మున్ననూరు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటకు వచ్చినట్లు తెలిపారు. ఒకే కమ్యూనిటీకి చెందిన ఆంధ్రా ప్రాంతంలోని కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన 11మంది ముఠాగా ఏర్పడి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏడు చోట్ల కేబుల్ వైర్లు చోరీ చేశారని, మిడ్జిల్ మండలం బోయినపల్లి, రాణిపేట, ఆమన్‌గల్, మానవపాడు, మక్తల్, అడ్డాకుల, చిన్నచింతకుంటలో చోరీకి పాల్పడ్డారు. ఇదే నెలలో 10న రాత్రి 9గంటలసమయంలో మిడ్జిల్ మండలంలోని బోయినపల్లిలో కేబుల్ వైర్లు చోరీ చేస్తూ విద్యుదాఘాతానికి గురై బాలస్వామి, జయరాజ్ ఇద్దరు అక్కడిక్కడే మృతిచెందిన సంగతి తెలిసిందే. మరో ఆరుగురు పరారీలో ఉండగా ముగ్గురు శుక్రవారం పట్టుబడ్డారు. నల్గొండ, జడ్చర్ల, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని వీరంతా జీవనం సాగిస్తుంటారని, ఉదయం వేళ తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు దొంగతనం చేయడం వృత్తిగా పెట్టుకున్నారన్నారు. కట్టర్‌లు, రాళ్లు వెంట తీసుకెళ్లి కార్లు, ఆటోల బ్యాటరీలు సైతం చోరీకి పాల్పడుతన్నారు. చోరీ సమయంలో ఎవరైన ప్రతిఘటిస్తే రాళ్లతో దాడి చేయడానికి సైతం వెనకాడరని పేర్కొన్నారు. ఇదే క్రమంలో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించాలని ఆశించి చిన్న ఆటో సరిపోవడం లేదని ఒక పెద్ద ట్రాలీ ఆటో కొందామని మహబూబ్‌నగర్ వెళ్తుండగా మిడ్జిల్ మండలం మున్ననూరు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. అనుమానాస్పదంగా కనిపించడంతో ముగ్గురిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా ముఠా గుట్టు రట్టుఅయింది. నిందితుల నుంచి రూ.4.50లక్షలు రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైని డీఎస్పీ అభినందించారు.

## మెడికల్ కళాశాల భవనాన్ని

# త్వరగా పూర్తి చేయాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



త్వరలో ప్రారంభం కాబోతున్న భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** మెడికల్ కళాశాల బాలికలు వసతి గృహ భవనాన్ని అక్టోబర్ ఒకటి వరకు పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. శుక్రవారం మర్రికంట శివారులో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్టోబర్ నెలలో విద్యార్థులు రాబోతున్నందున ఒకటో తేది నాటికి బాలికలు వసతి గృహం భవనాన్ని సకల సౌకర్యాలతో కూడినది అప్పగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పనులు దాదాపు పూర్తి అయ్యాయని, ఫ్యాన్లు, ప్లంబింగ్ పనులు నడుస్తున్నాయని గదువులోపల -మిగతా4లో..

## గద్వాల మెడికల్ కళాశాలలో ఓబిజి పోస్టులకు దరఖాస్తులు

**గద్వాల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** గద్వాల ప్రభుత్వం మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన అబ్ స్ట్రా ట్రిక్ స్కాన్డ్ గైనకా లజీ స్పెషాలటీ తో అసోసియేట్ ప్రోఫెసర్లు 2, అసిస్టెంట్ ప్రోఫెసర్లు 3 సీనియర్ ప్రెసిడెంట్లు 3, పోస్టలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి ఇంటర్వ్యూలు నేరుగా ఈ నెల 23 నుండి 25 వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఫస్ట్ అపాయిం ట్‌మెంట్ పద్ధతిన నిర్వహించడం జరుగుతందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్ధుల సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. కాంట్రాక్టు పద్ధతిన ఎంపికైనా అభ్యర్థులు 31.03.2025 వరకు పనిచేయాల్సి ఉంటుందని ఇంటర్వ్యూలు మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ హాస్పిటల్, గద్వాలలో నిర్వహించడం జరుగుతందన్నారు. పూర్తి వివరాలకు వెబ్సైట్ లో జతచేసిన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



జిల్లా కలెక్టర్ సంతోష్



## 10యేండ్లలో ఒక్క కిలోమీటర్..

# తవ్వలే..!



ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు సొరంగ మార్గాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

- గాలికి వదిలేసిన శ్రీశైల సొరంగం...
- 20 నెలల్లో ప్రాజెక్టు పూర్తి...
- ఉమ్మడి నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలు సస్యశామలం...
- వెయ్యి కోట్ల బడ్జెట్‌తో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు...
- గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.4వేల కోట్లకు పెంపు
- ఎస్ఎల్‌బీసీ పూర్తికి నెలల వారీగా నిధులు కేటాయిస్తాం...
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**అచ్చంపేట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** శ్రీశైలం సొరంగ మార్గంతో ప్రజలకు, యాత్రికులకు ఎంతో ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో సొరంగ మార్గాన్ని ప్రారంభిస్తే గత పాలకుల 10 సంవత్సరాల పాలనలో గాలికి వదిలేసి శ్రీశైల సొరంగ మార్గాన్ని కిలో మీటర్ కూడా తవ్వలేదని, గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులు, సొరంగాలు నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టి ప్రజలపై భారం మోపారు తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమి లేదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మన్నెవారిపల్లి వద్ద ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగాన్ని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర స్థాయి ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో కలిసి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ నిర్మాణం పూర్తి చేయడానికి నెలల వారిగా నిధులు కేటాయించడంతో పాటు నెలకు 400 మీటర్ల చొప్పున సొరంగం తవ్వితే రూ.14కోట్ల నిధు లు అవసరమవుతాయని, 20 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌ను సైతం పూర్తి చేస్తామని, భువనగిరి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, అచ్చంపే ట నియోజకవర్గంలోని అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపడుతామని ఆయన పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. బ్రాహ్మణ వెల్లెముల ధర్మారెడ్డి కాలువ, పిల్లవాయి కాలువ, బునియాదిగాని కాల్వ పనులను పూర్తి చేస్తామన్నారు. ఆయా ప్రాజెక్టుల క్రింద పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీలకు సైతం ప్రాధాన్యత కల్పించి పరిష్కరిస్తామని, నీళ్ల కోసం తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేయడమే తథ్యమని - మిగతా4లో..

### రూ.4400కోట్లకు క్యాబినెట్ సమావేశంలో మంజూరు చేస్తాం..



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను సవరించిన అంచనాల ప్రకారం రూ.4400కోట్లకు పెంచి క్యాబినెట్ సమావేశంలో మంజూరు చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. సొరంగం పనుల కోసం అయ్యే ఖర్చును ఏజేన్సీకి సాధ్యమైనంత త్వరగా చెల్లిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోను ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ద్వారా 2027 సెప్టెంబర్ 20 నాటికి సాగునీటిని అందిస్తామన్నారు. డిండి ప్రాజెక్టుపై ప్రతి వారం సమీక్షించాలని, ఇరిగేషన్ సెక్రటరిని ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీతో పాటు డిండి ప్రాజెక్టులు సైతం పూర్తి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అటవీశాఖ అనుమతులు తీసుకొచ్చేందుకు ఢిల్లీ స్థాయిలో చర్యలు చేపడుతామని, ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నల్గొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్‌రెడ్డిని కోరారు. 2వైపుల యుద్ద ప్రతిపాదికన సొరంగం తవ్వకం పనులు చేపట్టాలని, డిండి ప్రాజెక్టుకు ప్రాధాన్యత ప్రాజెక్టుగా తమ ప్రభుత్వం తీసుకుంటుందని, తగిన స్థాయిలో నిధులు తీసుకొని మంజూరు చేస్తామన్నారు. నల్గొండ జిల్లాలోని పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ, బునియాదిగాని కాల్వలు గ్రావిటీ ద్వారా నీటిని అందిస్తామని, ఈ మూడు కాల్వల ద్వారా 365 రోజుల పాటు సాగునీరు అందించే అవకాశం ఉన్నందున వీటికి వెంటనే ఆమోదం తెలుపాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పనులకు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు ప్రత్యేకించి ఎస్ఎల్‌బీసీ వద్ద సమీక్షను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని నియోజకవర్గాల్లో ఇరిగేషన్ పనులను వేగవంతం చేస్తామన్నారు. **- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

### 4వ పంపును 3 రోజుల్లో మరమ్మతులు చేస్తాం



ఎస్ఎల్‌బీసీ హైలెవల్ కెనాల్‌కు సంబంధించి మరమ్మత్తులో ఉన్న 4వ పంపును 3 రోజుల్లో మరమ్మత్తులు పూర్తి చేసి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఉదయసముద్రం, బ్రాహణ వెల్లేముల క్రింద భూ సేకరణకు సంబంధించి రూ.37 కోట్ల నిధులు విడుదల చేస్తే 2 నెలల్లో చెరువులను నింపుతామని, దీని ద్వారా కట్టంగూరు, నార్కెట్‌పల్లి మండలాల్లో సుమారు 70వేల ఎకరాల్లో సాగుచేసిన పంటలకు చెరువుల ద్వారా నీటిని విడుదల చేయడంతో పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. ఎంఆర్‌పీ శాశ్వత పరిష్కారం కాదని, గతంలోనే తాను గుర్తించానని, దానికి ఎస్ఎల్‌బీసీ శాశ్వత పరిష్కారంగా భావించి 2004లో మెనిఫెస్టోలో చేర్చడం జరిగిందని, శ్రీశైలం నీరు డెడ్ స్టోరేజ్‌కువెళ్లినప్పటికి ఎస్ఎల్‌బీసీ ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునన్నారు. ఎస్ఎల్‌బీసీని త్వరితగతిన పూర్తి చేసేందుకు నెలకు రూ.30కోట్లు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు.

**- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

# విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**ప్రతి మండలంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ**

**క్రీడా సామాగ్రి కొనుగోలులో బిఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపణలు**

**తిర్మలాపూర్‌లో ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఈ మేరకు రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల కార్పోరేట్ బడులకు ధీటుగా అభివృద్ధి చేస్తుందని అన్నారు. విద్యార్థులను ఉత్తమ విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించేందుకు విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పాలకులు క్రీడాసామాగ్రి కొనుగోలులో భారీ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 400ల కోట్లు నిధులు వెచ్చించి 20 వేల కోట్ల కిట్లను కొనుగోలు చేశారని ఆరోపించారు. ఏ మాత్రం నాణ్యత లేని నాసిరకం క్రికెట్ కిట్స్ కొని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్, ఊరకొండపేట, నవాబ్‌పేట మండలాల్లో ఇండోర్ స్టేడియాలు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు మూడు ఎకరాల స్థలం కావాలని ఆయా మండలాల తహసిల్దార్‌కు చెప్పానని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి మూడు ఎకరాలు ఎక్కడ ఉన్నా ఇండోర్ స్టేడియం నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు సమకూరుస్తామని, తిర్మలలాపూర్ పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ రవిందర్, ఎంఈఓ వెంకటయ్య, ఎంపిడిఓ మచ్చేందర్, హెచ్‌ఎం సుధాకర్, నాయకులు కృష్ణయ్య, శ్రీశైలం యాదవ్, యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, విక్రంరెడ్డి, నరహరి, శ్రీధర్‌రెడ్డి, రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లమ్మ కుంట రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**గద్వాల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** మల్లమ్మ కుంట రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ శుక్రవారం వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో నిర్మించవలసిన మల్లమ్మ కుంట రిజర్వాయర్ ప్రదేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం అవసరమైన స్థలంలో ప్రభుత్వ భూమి ఎంత ఉంది. పట్టా భూమి ఎంత ఉందన్ని వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ మ్యాప్‌ను సమీక్షించి నీటి పంపిణీ మార్గాల, ప్రత్యేకంగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా పంపింగ్ స్టేషన్ల స్థానం, వాటి సామర్థ్యం, రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం, సహజ అవరోధాలు, బండ్ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం వంటి అన్ని కీలక అంశాలను విశ్లేషించి, ఆ విషయాలను అమలు చేయడానికి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలను అందించారు. ప్రాజెక్టు నిర్మాణం వేగంగా, సమర్థవంతంగా పూర్తయ్యేలా క్రమ పద్ధతిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం భూమి సేకరణ, పంపింగ్ స్టేషన్లు బండ్ నిర్మాణం పద్ధతులను పకడ్బందీగా అమలు చేయాలని, సర్వే వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పటిస్తూ పూర్తిస్థాయిల్లో నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని



మల్లమ్మ కుంట రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డిఎస్ ఈఈలు

అధికారులను అదేశించారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, కోరగా, వారికి న్యాయం చేసే విధంగా సరైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ.ఈ విజయ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ శ్రీసివాస్ జోషి అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించాలి

**పిహెచ్‌సి సబ్ సెంటర్లలో రికార్డులు పక్కాగా నిర్వహించాలి**

**ప్రతినెలా 1న న్యూట్రిషన్‌డే చేపట్టాలి**

**వైద్యారోగ్య సిబ్బందికి కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం**




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు20 ప్రభాతవార్త:** ప్రాథమిక వైద్యారోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాల డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం ఆమె వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సబ్ సెంటర్ల మెడికల్‌ఆఫీసర్లతో వెబ్‌ఎక్స్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిహెచ్‌సిలు, సబ్ సెంటర్లలో అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, వాటి ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అంతేకాక ఫీవర్ సర్వేను పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతినెల 1న గ్రామ హెల్త్, శానిటేషన్, న్యూట్రిషన్ దినోత్సవం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. పిహెచ్‌సిలు, సబ్ సెంటర్ల లో సిబ్బంది, మెడికల్ సామాగ్రి కొరత ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించా లని ఈ సందర్భంగా ఆమె సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా వైద్యారోగ్య ఆరోగ్యశాఖ అధికారి పద్మ పాల్గొన్నారు.

# తనయుడి చేతిలో తండ్రి హత్య

**కేసు నమోదు చేసిన పోలీసులు**



మృతుడు నారాయణ (ఫైల్)

**రాజాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల పరిధిలోని రాయపల్లి గ్రామానికి చెందిన నందేష్ ఆనంద్ అనే యువకుడు గురువారం రాత్రి తన తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేశాడు. మృతుని భార్య కథనం ప్రకారం చంద్రకళ, నారాయణ దంపతులకు కొడుకు, కూతురు ఇద్దరు సంతానం. కూతురు వివాహం చేయగా ఆమె భర్తతో కాపురం చేసుకుంటుంది. కొడుకు నదేష్ ఆనంద్ (31) 10వ తరగతి వరకు చదివి ఎటువంటి పనులు చేయకుండా ఇంటి వద్దనే ఉండేవాడని, తన అవసరాల కోసం తల్లిదండ్రులను బెదిరించి బలవంతంగా డబ్బులు తీసుకునేవాడని ఈ విషయంలో తల్లిదండ్రులతో అప్పుడప్పుడు గొడవ పడేవాడని డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని తల్లిదండ్రులను బెదిరించేవాడని గురువారం రాత్రి తండ్రి నారాయణతో డబ్బులు ఇవ్వమని గొడవ పడ్డాడని భోజనం చేసి నిద్రించగా రాత్రా సమయంలో నారాయణ కేకలు వేయగా అవి విని భార్య చంద్రకళ నిద్రలో నుంచి లేచి చూడగా తన కొడుకు నందేష్ ఆనంద్ చేతిలో రక్తంతో నిండిన గొడ్డలిని చూసి కేకలు వేయగా ఆమె మరిది రవిందర్, మరదల రాజేశ్వరితో -మిగతా4లో..

## ప్రజాపాలనలో రూ.500లకు గ్యాస్ సిలిండర్

**లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు**

**పెబ్బేర్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** పెబ్బేర్ మండలం రాంపూర్ గ్రామంలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన వెంటనే ఎన్నికలలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుంది. శుక్రవారం 500 కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్న సందర్భంగా వాటికి సంబంధించిన టోకెన్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవుడు, నాయకులు ఈశ్వరి రెడ్డి, కాశన్న, శేఖర్ రెడ్డి, బలిజ విరన్న, బాలర, గ్రామస్తులు ముర్తి, సత్య రెడ్డి, నరహరి, గోపాల్ నాయుడు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సిలిండర్ లబ్ధిదారులకు టోకెన్లు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## డిఎస్ఆర్‌సి పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

**ఆసుపత్రి సూపర్ డెంట్ వినోద్**

**గద్వాల, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు తిజీ -సాక్స్ విభాగం నందు డి.ఎస్.ఆర్.సి కౌన్సిలర్ పోస్టు-(1) కోరకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్ట్ కు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ / డిప్లొమా సైకాలజీ/ సోషల్ వర్క్ / సోషియాలజీ/ఆంత్రోపాలజీ / హ్యూమన్ డెవలప్మెంట్ నర్సింగ్ విద్యలో ఒక సంవత్సరం అనుభవం తర్వాత పీజీ డిగ్రీ డిప్లయా వర్కింగ్ ఫీల్డ్ ఆఫ్ కౌన్సిలింగ్ / హెల్త్ సెక్టార్, ప్రేఫేరబ్లీ హెచ్ఐవి ఎయిడ్స్ లేదా గ్రాడ్యుయేట్ సైకాలజీ సోషల్ వర్క్ / నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల అనుభవం తర్వాత గ్రాడ్యుయేషన్ ఆఫ్ వర్కింగ్ హెల్త్ సెక్టార్ విద్యార్హతలు గల కలిగి, వారి యొక్క వయస్సు 21 నుంచి 45 సంవత్సరములోపు గలవారు అర్హులని తెలిపారు. ఈ అర్హతలు ఉన్న అభ్యర్థులు తమ యొక్క రెస్యూమ్స్ ను పత్రిక ప్రకటన ప్రచురితం అయినప్పటి నుంచి 15 రోజుల లోపు జిల్లా ఆసుపత్రి ఆఫీస్ యొక్క పని వేళలో సమయం ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఇవ్వగలరని ఆయన కోరారు.

## పిసీసీ అధ్యక్షుడుకి ఘన సన్మానం

**పెబ్బేర్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** తెలంగాణ నూతన పిసిసి అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైనా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో పెబ్బేర్ మండలానికి చెందినటువంటి దాదాపు 50 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఘనంగా సన్మానించారు. విద్యార్థి దేశ నుంచి నాయకునిగా అంచలం చలుగా ఎదుగుతూ నేడు పిసిసి అధ్య క్షుడుగా ఎన్నిక కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన దగ్గర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కష్టపడి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, నాయకులు దయాకర్ రెడ్డి, శివ నరసింహనాయుడు, బోయి సత్తి జగదీశ్వర రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, రాముడు,రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన పిసిసి అధ్యక్షుడి సన్మానిస్తున్న పెబ్బేర్ మండల కాంగ్రెస్ కమిటీ

## ఎర్రవల్లి మండల ఇన్చార్జి తహసీల్దారుగా నరేష్

**ఇటిక్యాల సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండల ఇన్చార్జి తహసిల్దారుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి సెక్షన్‌లో సూపర్ డెంట్‌గా పనిచేసిన నరేష్‌ను ఎర్రవల్లి మండల ఇన్చార్జి తహసిల్దారుగా జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఎర్రవల్లి ఇన్చార్జి తాహసిల్దారుగా నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్చార్జి తాహసిల్దారుగా పనిచేసిన ధరణి షా నుండి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఇన్చార్జి తహసిల్దారు బాధ్యతలు చేపట్టడంతో ఆర్.ఐ.లు నరేష్,శ్రీనివాసులు,మండల సర్వేయర్ దౌలమ్మ, కార్యాలయ సిబ్బంది ఆయనకు పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ ముఖ్య నాయకులు నీలి శ్రీనివాసులు, పోతురాజు సోమన్నాద్రి, వెంకటన్న బలరాముడు, బీమపల్లి, తిమ్మప్ప గౌడు, బజారన్న తదితరులు ఇన్చార్జి తాహసిల్దార్ నరేష్ ను శాలువాతో సన్మానించి పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలిపుతున్న ఇంచార్జ్ తాహసిల్దార్

## నేల,నీరు ప్రకృతి సంరక్షణ పద్ధతులపై శిక్షణ

**బిజినపల్లి,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** వర్షాధారిత ప్రాంతంలో నేలలు, నీటి సంరక్షణ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంలో పంట, నేల యాజమాన్యంపై రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పాలెం నంది వడ్డెమాన్ గ్రామాల్లోని రైతు వేదికల్లో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాసంగి పంట ప్రణాళిక వరి ప్రత్యామ్నయంగా ఆరుతడి పంటసాగు విధానంపై కెవికె కో ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు.బిందుసేద్యం స్పీకర్ల సేద్యంపై నెట్ ఆఫ్ఎం డీజీఎం సుబ్బారావు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో పంట, నేల యాజమాన్యం, బీజామృతం, జీవామృతం, మల్చింగ్, పంచకావ్యం, ఎగ్‌సెల్ ఎరువు తయారీ ఉపయోగాలు వ్యవసాయ అధికారి అన్నపూర్ణ రైతులకు, విస్తరణ అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు వాసు, వ్యవసాయ కార్యదర్శి పూర్ణచంద్రారెడ్డి, ఏఓ నీతిరెడ్డి, జిల్లాలోని అన్ని గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...

**-మున్సిపల్ కమిషనర్ బి.నరేష్‌బాబు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ బి.నరేష్‌బాబు ప్రజలను కోరారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ప్రజలు అనారోగ్యాల భారిన పడకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకునేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దోమలను చంపే మందులను పిచికారి చేయాలన్నారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్ సలాం, శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళితో పాటు కార్యాలయ సిబ్బంది మరియు మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## సాయిచంద్‌కు ఘన నివాళి

**మక్తల్,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమ గాయకుడు, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ వి.సాయిచంద్ జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యురాలు శరణ్య, బండారి ఆనంద్,బండారు మల్లు, బండారి చెన్నప్ప, ప్యాట పవన్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి..

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వరి కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం ద్వారా క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా ఇస్తున్నందున జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోల చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో నవంబర్ మొదటి వారం నుండి కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామ పంచాయతీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ,ఐ. కే.పి ప్యాక్స్,మేప్మా వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించాలని సూచించారు. నాణ్యమైన వడ్లు తీసుకోవడంతో పాటు దొడ్డు రకం, సన్న రకం వేరు వేరుగా చేసుకోగలిగే విధంగా కొనుగోలు కేంద్రాల్లో పని చేసి సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి మండల రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో వడ్ల నుండి, చెత్త తాలు వేరు చేసేవిధంగా ఫ్యాన్ ఏర్పాటు చేసుకోవాలని అదేవిధంగా వరి రకం పరిశీలించేందుకు మైక్రో మీటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ శాఖ దగ్గర ఉన్న తూకం యంత్రాలను తూనికలు కొలతల శాఖ అధికారి ద్వారా తనిఖీ చేయించి ధృవీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. తేమ కొలిచే యంత్రాలను సైతం తనిఖీ చేయించి అవి సరిగ్గా పనిచేస్తున్నాయా లేవా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తాడ్పాలిన్ లు సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం సివిల్ సప్లై ఇర్ఫాన్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ పూర్ణాచందర్, తూనికలు కొలతల అధికారి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

# ఓజోన్ క్షీణతపై పేపర్ ప్రజంటేషన్..

### విద్యార్థులను అభినందించిన జడ్చర్ల బిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ సుకన్య

**జడ్చర్ల,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల, జంతు శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఓజోన్ క్షీణత ప్రస్తుత పరిస్థితులు మానవుని పాత్ర అనే అంశంపై విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొ॥ జి.సుకన్య మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మానవుని కార్యకలాపాల వల్ల ఓజోన్ క్షీణతకు ఏ విధంగా గురవుతుందో ఆకర్షణీయంగా, సందేశాత్మకంగా తయారు చేసిన వివిధ పోస్టర్లను, ఓజోన్ పరిరక్షణ ఏ విధంగా చేయాలో వివరించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. వి. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. రుఖియాభాను మాట్లాడుతూ ఓజోన్ క్షీణత వల్ల కలిగే పర్యవసానాలను వివరించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి వి.వేణు మాట్లాడుతూ మానవుని కార్యకలాపాల వల్ల ఓజోన్ పొర ఏ విధంగా క్షీణతకు గురవుతుందో అదేవిదంగా నేడు మానవునికి, జీవ జలానికి వాటిల్లుతున్న ముప్పుని వాటిని నివారణ గురించి వివరించారు. 28 టీములుగా మొత్తం 84 మంది విద్యార్థులు వివిధ రకాల పోస్టర్లను తయారు చేసి వారి ప్రతిభను చాటారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా డా.ఇ. పావని, డా.బి. నాగలక్ష్మి, ఎల్. ప్రవీణ్‌కుమార్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ బహుమతి శయ్యేస్త అజ్మి, ఎస్.మనిషా,ఉమ్మమ సర్వత్, ద్వితీయ బహుమతి షేక్ షాజియా, కె. మౌనిక, కె.దీపిక, తృతీయ బహుమతి ఎం. రాజేశ్వరి, ఎ.స్వప్న, కె.భూమికలకు అందజేశారు. ప్రత్యేక బహుమతిని జి. అశ్విత, ఎస్. శిరీష టీంకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇశ్రత్ సుల్తానా, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎ. రజని, జె. విక్రమ్‌కుమార్, రాజేశ్‌కుమార్, చిరంజీవి, తిమ్మప్ప, నరసింహ, అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ సుకన్య

# అర్హులైన వారందరికీ పొజీషన్ చూపించాలి...

**ఆత్మకూరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని అర్హులైన పేదలందరికీ గడచిన 20 సంవత్సరాల క్రితం ప్లాట్ల పట్టాలు పంపిణీ చేసి పొజిషన్ చూపించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ శుక్రవారం రోజు సిపిఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. అంతకుముందుగా పట్టణంలోని గాంధీ చౌరస్తా మీదుగా తాసిల్దార్ కార్యాలయం వరకు సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ పట్టణం లోని సర్వేనెంబర్ 281 2008 లో 16 ఎకరాల స్థలంలో 1200 మందికి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు తెలుపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుమార్లు పొజిషన్ చూపించాలంటూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా మక్తల్ శాసనసభ్యులు వాకిడి శ్రీహరి స్పందించి అధికారులతో రీసర్వే చేయించి పట్టాలు పంపిణీ చేసిన వారందరికీ హద్దురాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి 70 గజాలు చొప్పున ప్లాట్లను అనుమతి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం తాసిల్దార్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మహమూద్ రాజు, బుచ్చన్న అజయ్ వెంకట్ రాములు తదితరులతో పాటుగా పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న లబ్ధిదారులు

## బిసిల రిజర్వేషన్లు కాంగ్రెస్‌కే సాధ్యం

**కెటిఆర్ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్**

**చిన్నంబావి,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో మన ప్రభుత్వం హయాంలో బిసిల రిజర్వేషన్ 42 నుండి 23 శాతానికి ఎందుకు తగ్గించారో కెటిఆర్ సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు బిసికు ఇవ్వగలరా అని చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ కెటిఆర్‌ను ప్రశ్నించారు. శుక్రవారం చిన్నంబావి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో కులగణన చేయాలనే ఆలోచన ఎందుకు మీకు రాలేదని, బిఆర్ఎస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత పదవుల్లో బిసిలకు న్యాయం చేయలేని మీరు బిసిల గురించి ప్రశ్నిస్తుంటే హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. కెటిఆర్ తండ్రి చాటున కొడుకుగా, మామ చాటు అల్లుడిగా హరీశ్‌రావు లాగా రేవంత్‌రెడ్డి ఎదగలేదని రేవంత్‌రెడ్డి లాంటి నికార్స్ అయిన నాయకుడు ఒంటరిగా ఎదిగారని అన్నారు. కెటిఆర్ సుద్దపూస మాటలు మానుకుని కెటిఆర్‌కు సవాల్ విసిరే హక్కు కూడా లేదని అన్నారు. తొమ్మిది ఏళ్ల మీరు ఏం చేశారని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం తప్పక బిసి కులగణన చేసి తీరుతామని మీ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టు బయట పెట్టకుండా ఏం చేశారని ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో బిసిలకు రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ ప్రతిపాదించిన దానికి మద్దతు ఇవ్వకుండా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి: మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**ఆత్మకూర్ సెప్టెంబర్20 ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణ ప్రజలు అంటువ్యాధుల నివారణ కోసం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నిర్వహించనున్న ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజు ఆత్మకూరులోని ఆయా వార్డులలో అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లో అంటువ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ పాలకవర్గం చేస్తున్న పరిశుభ్రతకు సహాయ సహకారాలు అందించి మురగునీటిని తొలంగించేందుకు ప్రజలు సహకరించాలని వారి విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే పట్టణంలోని ప్రధాన కోడలలో నిలిచినటువంటి మురుగునీరును ఎప్పటికప్పుడు తొలిగించేందుకు మున్సిపల్ పాలకవర్గం అన్ని చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు.దోమల నివారణ కోసం పాలకవర్గం ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పిచికారి చేస్తూ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు రామకృష్ణ అశ్విని కుమార్ మహేశ్వరి ప్రభుత్వం బేగం తదితరులతో పాటుగా పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని ఆరవ వార్డులో మురుగునీటి లో పిచికారి చేయిస్తున్న చైర్మన్, కమిషనర్

## పాఠశాలకు కంప్యూటర్స్, విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ అఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా వాసవీక్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మండలంలోని ముకురాల గ్రామంలో పాఠశాలకు కంప్యూటర్, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కంబాక్స్ బాక్స్‌లు, పెనిస్సిల్స్, స్కేల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ విద్యార్థులకు వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలకు కంప్యూటర్ సమకూర్చిన దాత ఇరువెంటి రమేష్‌కు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీక్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, క్లబ్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్‌అధికారి ఇరువెంటి రమేష్,జోన్ చైర్మన్ కూనసంతోష్,కల్వకుర్తి వాసవీక్లబ్ ప్రెసిడెంట్ చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గి అశోక్‌కుమార్, ప్రధానోపా ధ్యాయులు రామేశ్వర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## క్రీడలతో బంగారు భవిష్యత్తు:సిఐ జి. చంద్రశేఖర్

**మక్తల్,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ తమ విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో విశేషంగా రాణించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని మక్తల్ సిఐ జి. చంద్రశేఖర్ అన్నారు. జాతీయ షూటింగ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలో క్రీడా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షూటింగ్ బాల్ క్రీడల్లో ఇటీవల జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డివిచారి, పీఈటీలు అమ్రేష్, దామోదర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

### నిర్భంద కార్మికులకు ఆర్థికసాయం అందజేసిన కలెక్టర్



ఆర్థిక సహాయం అంద చేసిన కలెక్టర్ సంతోష్

**గద్వాల,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మహేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ (08) మంది నిర్బంధ కార్మికులకు విముక్తి కల్పించి వారి జీవనోపాధి కోరకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి 30వేల రూపాయల చొప్పున చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గద్వాల మండలం వీరాపురం గ్రామంలోని ఇటుక బట్టిలో (08) మంది కార్మికులను నిర్బంధించి వారితో బలవంతంగా పనులు చేయించుకుంటు ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసిన వెంటనే వారిని విముక్తి కల్పించిన వారి జీవనోపాధి కొరకు తక్షణ ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.

### తడి,పొడి చెత్తను వేరు చేయాలి

**స్వచ్ఛత ఈసేవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజయ్య**



ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజయ్య

**జడ్చర్ల,సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో గౌరీశంకర్ కాలనీలో శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ సొంటె రాజయ్య, ఈఈ అశోక్, ప్రొ॥ సదాశవయ్యలు హాజరయ్యారు. స్వచ్ఛత ఈ సేవ ప్రతిజ్ఞ,సెగ్రిగేషన్‌పై కమిషనర్ మాట్లాడుతూ తడి,పొడి హానికరమైన చెత్తను వేరుచేసి స్వచ్ఛతఆటోలకు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కృష్ణయ్య, సిఎల్ఆర్‌పి సునిత, ఆర్‌పి సరిత, స్వాతి, అధికారులు పాల్గొన్నారు.

### గద్వాల ఎమ్మార్వోగా మల్లికార్జున్



**గద్వాల సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** గద్వాల మండల తహసిల్దార్‌గా మల్లికార్జున్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వనపర్తి జిల్లాలో డిప్యూటీ తాసిల్దార్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఇటీవల తహసీల్దార్‌గా పదోన్నతిపొందారు. శుక్రవారం గద్వాల తాహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈసందర్భంగా ఇంచార్జి తాహసిల్దార్ కరుణాకర్ నూతన తహసీల్దార్ మల్లికార్జున్‌కు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ తాహసిల్దార్ శివకుమార్ ఆర్ఐలు శ్రీనివాసులు, మదన్ శుభకాంక్షలు తెలిపారు.

### వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి



**పెబ్బేర్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణం నందు వల్లపు రెడ్డి రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్లో మండల కో ఆప్షన్ సభ్యులు సత్తార్ కుమార్తె వివాహానికి హాజరైన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో వీరి వెంట పెబ్బేర్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ మండల్ నాయకులు మండల అధ్యక్షుడు వనం రాములు, మజీద్, మున్సిపల్ వైస్ చైర్మన్, కర్రే స్వామి, మేకల ఎల్లయ్య, హరి శంకర్ నాయుడు, మండల మైనార్టీ ప్రెసిడెంట్ నసీరుద్దీన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్

**గద్వాల సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీస్‌కు సమీపంలో బజాజ్ షోరూం కు దగ్గరలో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. నీటి ఉధృతికి పైప్‌లైన్ పగిలి నీరువృథాగా పోయి, రోడ్డు అంత కూడా నీరు ప్రవహించడంతో చుట్టు, ముట్టు ఉన్న అధికారులు ప్రజలు ఇబ్బందులు ఎదురుకున్నారు.నీరు వృథాగా పోయిన మిషన్ భగీరథ అధికారులు స్పందించలేదని ఆ వీధి ప్రజలు ఆరోపించారు.

## గర్భిణీకు పిల్లల సంరక్షణపై అవగాహన



**వంగూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పుట్టిన పిల్లలకు ఆరోగ్యరీత్య అవగాహన కల్పిస్తూ తల్లి పిల్లల సంరక్షణపై అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిం చే పోషకాహారం కూడిన వాటిని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో డ్రైడే సందర్భంగా ప్రభుత్వాసుపత్రి అధికారులు, ఆశా వర్కర్లు వర్షకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ గ్రామంలోని కూడలిల వెంట తిరుగుతూ పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలని ప్రజలకు సూచించారు. దీంతో పాటు దోమలు, ఈగలు, పందులు వీరవాహరం చేసే ప్రదేశాల్లో బ్లీచింగ్ ఫౌడర్‌ను పిచికారి చేసి నీటి నిల్వ ఉంచకుండా చూసు కోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రవీందర్, మాజీ సర్పంచ్ మల్లయ్య, సూపర్‌వైజర్ పద్మ, రోజమ్మ, ఏపీఎం చంద్రయ్య తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి


సభ్యత్వ నమోదు అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని బిజెపి వైపు ఆకర్షితులను చేయాలని బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బి. కొండయ్య అన్నారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధి లోని దండులో శుక్రవారం బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 250 సభ్యత్వాలకు తగ్గకుండా అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నియో జకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ అఖిల రాజశేఖర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంఛార్జి జి.ప్రసన్న బలరాంరెడ్డి,నాయకులు ప్రతాప్‌రెడ్డి, విద్యాసాగర్, అర్బన్ మండల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ చీరాల సత్యనారాయణ, బిజెవైఎం మండల అధ్యక్షులు నరసింహ,రామ్‌రెడ్డి,నాగరాజు, అశోక్, కృష్ణ, రాములు, జీప్‌రాము, బాల్‌రెడ్డి, కుర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రొసిడింగ్ పత్రాలు అందజజేత


దేవదారికుంట తండాలో మహాలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 20 ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకే సిలిండర్ మహిళలకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేత కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం మండలంలోని దేవదారికుంట తండాలో స్వచ్ఛత హి సేవ 2024 జరిగింది. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయడం జరుగుతుందని, అర్హులైన వారందరికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చందర్‌నాయక్, స్థానికులు మూనవత్ రతన్‌సింగ్, ఇస్లావత్ బలరాం, సభావత్ బాలు, గిరిజన మహిళలుమునవత్ లక్ష్మి,వర్త్య బికిలి, ఇస్లావత్ రామ్లీ, ఇస్లావత్ శారద, చాందిని, అనూష పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పెబ్బేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని శాఖపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గవర్నమెంట్ యువ డాక్టర్ల బృందం మహబూబ్‌నగర్ వారు శుక్రవారం శాఖాపూరం గ్రామ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు గైడెన్స్, ఆరోగ్యం గురించి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారి అవగాహన కల్పించి బ్యాగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ బృందం 2023 నుంచి మంది సభ్యు లతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులకు తోడ్పాటు అందిస్తూ సహాయ సహకారాలు అందిస్తూ ఫౌండేషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు.సంయుక్త ఫౌండేషన్ అధ్యక్షులు అక్షయ్ కుమార్, వివేక్ బృందం, మున్ముందు ఇంకా ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేయాలని ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్,సురేష్, విజయకుమార్,ఖయ్యాం, చంద్రశేఖర్,రామచందర్, జయప్రకాష్, శ్రీనివాసులు,రాధ లక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం


ముస్లిం సేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన రక్తదాన శిబిరం

**ఆత్మకూర్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం రోజు ముస్లిం సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి రక్తదాన శిబిరం విజయవంతంగా కొనసా గింది.పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని రక్తదానం చేయాలని ముస్లిం సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా బాధ్యులు కలాం పాషా తదితరులు హాజరై రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అపద సమయంలో పేద ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం నిర్వహించి మహమ్మద్ ప్రవక్త సూచించిన శాంతి మార్గంలో కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్య క్రమంలో ముస్లిం మత పెద్దలు కామద్దీన్, అమర్, అబ్దుల్, మౌలానా, ఖాసిం, షంషేర్ తదితరులతో పాటుగా పలువురు యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## బాలుడు మిస్సింగ్ కలకలం

### -గ్రామంలోనే గుర్తించి పట్టుకున్న పోలీసులు

**వెల్దండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సంతోష్ రాఘాయిపల్లి వద్ద ఉన్న ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పిన సంతోష్ పాఠశాలకు హాజరు కాకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారమందించారు. గ్రామంలో తల్లిదండ్రులు వెతికిన దొరకకపోవడంతో పోలీసులను సంప్రదించారు. ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని సీసీ పుటేజీలను పరిశీలించారు. సంతోష్ పాఠశాలకు వెళ్లకుండా తనవ్యవసాయ పొలానికి వెళ్లిఉంటాడని పోలీసులు, కుటుంబ సభ్యులు భావించి అక్కడికి వెళ్లారు. గ్రామంలోని పాడుబడ్డ బావి వద్ద కొద్దిసేపు ఉండి, అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిల్చుని వద్ద ఉండటంతో పోలీసులు గుర్తించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తప్పిపోయాడనే వార్త కొద్దిసేపులోనే సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కలకలంరేపింది.బాలుడిని గ్రామంలోనే పోలీసులుగుర్తించడంతో గ్రామస్తులుసైతంఊపిరి పీల్చుకున్నారు.

# దేవరకద్రలో వాసవీమాత పల్లకిసేవ

### -అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


వాసవీమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామృతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు భరోసా క్రింద రూ.7500లు అందించాలి

### -సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పర్వతాలు

**వంగూరు, సెప్టెంబర్20 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులను ఆదుకోవడానికి రైతు భరోసా పథకం క్రింద ఎకరానికి రూ.7500లు అందిస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చి రైతు ఖాతాలో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వంగూరు మండలం రంగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఎం గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు ఒక్కసారి కూడా రైతు భరోసాను వేయలేదని, రైతు భరోసా పథకం క్రింద డబ్బులు అందకపోవడంతో వర్షకాలం వ్యవసాయం సాగు చేయడానికి ఎరువులు, విత్తనాలు, కొనుగోలు చేసేందుకుఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సాగు చేయించి సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతు భరోసా అందిస్తామనే మాటలు చెప్పుకుంటు కాలయాపన చేస్తున్నారే తప్ప రైతుబంధు అందించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలుస్తామని, ఇచ్చిన హామీని మరిచి రైతులను మభ్య పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. వివిధ కారణాలతో రైతులను మోసం చేస్తుందని, రుణమాఫీ చేయడానికి బడ్జెట్ కేటాయించలేదని, రూ.2 లక్షల రుణమాఫీ ఒకే దఫాలోమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో అనేక మంది రైతులు ధరఖాస్తులు చేసుకున్న రూ.2లక్షల రుణమాఫీ అందలేదని ఆయన పేర్కొన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రూ.2లక్షల రుణమాఫీ, రైతు బంధు డబ్బులనువెంటనే అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చింత ఆంజనేయులు, మండల కార్యదర్శి బాలస్వామి, మాజీ సర్పంచ్ చింతరూప్సీ,నాయకులు జగన్,రామస్వామి,రాములు, సత్యనారాయణ, భీంరాజు, బాల్‌నారాయణ తదితరులు ఉన్నారు.

# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ■అడిషనల్ డిఆర్‌డిఓ నాగేంద్రం


ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డిఆర్‌డిఓ

**పెబ్బేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని సుగురు గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా అడిషనల్ డిఆర్‌డిఓ నాగేంద్ర మాట్లా డుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని విష జ్వరాలు ప్రబలుతుండడంతో కలెకటర్ ఆదేశాల మేరకు గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికి తిరిగి పారిశుధ్య పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు సలహాలు చేశారు.ఇంటి పరిసరాల్లో పాత ఇనుప సామాగ్రి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని లేకుంటే దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సంక్రమిస్తాయని అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఈసీ నరసింహా రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శ్యాంసుందర్, అంగన్వాడి టీచర్ శ్యామల,సావిత్రి, శ్రీదేవి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ యూత్ గణేష్ లడ్డు వేలం రూ.40వేలు



**వెల్దండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొట్ర గ్రామంలో జై శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనా థుడి వద్ద లడ్డు వేలం పాటలో కాయితీ సుధీర్ మొదటి లడ్డును రూ.40,116లకు, 2వ లడ్డును చల్లమల్ల వెంకటయ్య రూ.24, 116లకు దక్కించుకున్నారు. లడ్డును దక్కించుకున్న వారిని యూత్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రవీందర్‌రావు, తిరుపతిగౌడ్, అరవింద్, శివయాదవ్, సాయిరాం, ఆసిఫ్ తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసిడింగుల పంపిణీ


గ్యాస్ సబ్సిడీ ప్రొసిడింగ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి

**ఇటిక్యాల సెప్టెంబర్20 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రజలకు 500 రూపాయలకే సిలిండర్ సబ్సిడీపై ఇచ్చేందుకు గాను ప్రభుత్వం పంపిణీ చేసిన ప్రొసిడింగులను శుక్రవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ తన సొంత గ్రామం పుటాన్‌దొడ్డి గ్రామంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. అలాగే కొండేరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు పోతు రాజు సోమనాద్రి ఆధ్వర్యంలో లబ్దిదారులకు 500రూపాయలకే గ్యాస్ సబ్సిడీప్రొసిడింగులను గ్రామపంచాయితీ వద్ద లబ్దిదారులకు పంపిణీ చేశారు. అంతేకాక అల్లంపూర్ నియోజకవర్గంలోని మండల గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో లబ్దిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసిడింగ్‌లను పంపిణీ చేశారు.

## రూ.2300 ధర పలికిన కింటాల్ సోన

**దేవరకద్ర, సెప్టెంబరు20 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు 9 కింటాళ్ళ సోన(ఆర్ ఎన్ఆర్) ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2300 ధర పలికింది.అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

### బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలపై నుండి దూసుకెళ్లిన లారీ


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ

**బాలానగర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** దురదృష్టవశాత్తు బైకు అదుపుతప్పి బైక్ మీద నుండి మహిళ రోడ్డుపై పడడంతో లారీ తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన రహేనాబేగం (48) తన కుమారుడితో కలిసి షాద్‌నగర్ నుండి జడ్చర్ల వైపు బైక్‌పై వెళ్తుండగా బాలానగర్ చౌరస్తా వద్దకు రాగానే స్టాపర్ల వద్ద సదరు మహిళ కాలు స్టాపర్లకు తగలడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది.దీంతో కుమారుడు రోడ్డు ఎడమవైపుపడగా, తల్లిమాత్రం రోడ్డుపై పడడంతో వెనకాలే వస్తున్న లారీ ఆ మహిళ తలపై మీదుగా వెళ్లడంతో తల నుజ్జు నుజ్జు అయిప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నట్లు ఎస్సై తిరుపాజీ వెల్లడించారు.

## మార్కెట్ డైరెక్టర్‌ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఉప్పునుంతల, సెప్టెంబరు20 ప్రభాతవార్త:** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కొరటికల్ గ్రామానికి చెందిన గోపిరెడ్డి రమేష్‌రెడ్డిని నియమించడంతో శుక్రవారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.సన్మానించిన వారిలో తిప్పర్తి నరసింహారెడ్డి, గోపిరెడ్డి రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు)లు ఉన్నారు.



# ఘనంగా వేదసాయిచంద్ జయంతి వేడుకలు


సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, తెలంగాణ రాష్ట్ర మాజీ గిడ్డంగుల శాఖ ఛైర్మన్ శ్రీవేద సాయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తన గళం ద్వారా తెలంగాణ ప్రజలను మేల్కొలిపి తెలంగాణను సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, పోలే అశోక్, హన్మంతునాయక్, కొండలుయాదవ్,శ్రీనివాసులు, జగ్గనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**కొత్తకోట సెప్టెంబర్20 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమ గాయకులు తెలంగాణ రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ స్వర్గీయ వేద సాయిచంద్ జయంతిని పురస్కరించుకొని కొత్తకోట చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సాయిచంద్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన సతీమణి రాష్ట్ర మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ రజనీ సాయి చంద్ పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొత్తకోట మండల బిఆర్ఎస్ పార్టీ యువకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో సాయి చంద్ తన పాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు.తెలంగాణ ప్రజల గుండెల్లో సాయిచంద్ చెరగని ముద్ర వేశారని తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని బిఆర్ఎస్ పార్టీ యువకులు వారి సేవలను కొనయాడారు.కార్యక్రమంలో కొత్తకోట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వామన్ గౌడ్,మాజీ సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, జిల్లాఅధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, నాయకులు అయ్యన్న, రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, యువ నాయకులు, యువకులు, అభిమానులు, సన్నిహితులు పాల్గొన్నారు.



**రాజాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ గాయకుడు, ఉద్యమనేత వేదసాయి చందు జయంతి సందర్భంగా జడ్చర్ల సత్యేశ్వరా అనాథ ఆశ్రమంలో అనాధలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని బిఆర్ఎస్ పార్టీ యూత్‌వింగ్ మండల అధ్యక్షుడు బంగారి వెంకటేష్ తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ గిడ్డంగుల ఛైర్మన్‌వేద రజినీహాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయిచంద్ జయంతి సందర్భంగా అనాథ ఆశ్రమంలో పార్టీ నాయకులు సాయిచందు, అభిమానులు కలిసి అన్నదానం కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ విజయ్‌కుమార్, పార్టీ వైస్ ప్రెసిడెంట్ రచమళ్ల యాదగిరి, మాజీ ఎంపిటిసి శేఖర్‌గౌడ్, జడ్చర్ల యూత్ వింగ్ అధ్యక్షులు వీరేష్, కెసిఆర్ సేవాదళ్ అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, శ్రీను నాయక్, బీమగాళ్ల నర్సిములు, బైండ్ల నరసింహ, రంజిత్‌నాయక్, పల్లెరవి, చంద్రయ్య, దాసు, బుర్ర అనిల్‌కుమార్, నియోజకవర్గ యూత్ వింగ్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ పైన దాడి కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వనపర్తి నుండి మహబూబ్‌నగర్ వెళుతున్న ఆర్టీసీ బస్సు గురువారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో షాపూర్ గేట్ సమీపంలో ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి.మండల కేంద్రం నుండి షాపూర్ వైపు టు వీలర్ పై వస్తున్న కళ్లెం కుమార్ 27 సంవత్సరములు షాపూర్ గ్రామవాసి మద్యం మత్తులో ఆర్టీసీబస్సు పైకి వస్తూఆర్టీసీ డ్రైవర్ మోడల్ శ్రీనివాసులపై దుర్భాషలాడుతూ దాడి చేస్తుండగా కండక్టర్ మోహన్ గౌడ్ రోడ్డు విస్తరణ సూపర్వైజర్లు రాజు,నాగరాజులు డ్రైవర్ పై దాడి చేస్తున్నకుమారుని అడ్డుకున్నారు.ఆర్టీసీ డ్రైవర్ మోడల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కళెం కుమార్ పైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదినోత్సవం

### జన్మదిన వేడుకలకు హాజరైన సీఎం సోదరుడు

**కొత్తకోట సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** అలంపూర్ మాజీ ఎమ్మెల్యే బీజెపి రాష్ట్ర నాయకులు రావుల రవీంద్రనాథ్ రెడ్డి 81 వ జన్మదిన వేడుకలు కోత్తకోటలోని రాహూల్ మల్టిస్పెషలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ హరిన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ జన్మదిన వేడుకలో రాహుళ హాస్పిటల్ దగ్గర యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాదానం చేశారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కానాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వగృహంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వంశీదర్ రెడ్డి,వనపర్తి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ వేడుకల్లో మహిళలు కోలాటలతో ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా వేడుకలకు హాజరైన ప్రముఖులకు పవిత్రమైన భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ తినిపిస్తున్న సీఎం సోదరుడు.. రక్తదానం చేస్తున్న దృశ్యం

Form No.3
(See Regulation -15 (1)(a)] /16(3)
SUMMONS UNDER SUB-SECTION (4) OF SECTION 19 OF THE ACT, R/W SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBT RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES, 1993
BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - II. 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD -500001
O.A. No. 948/2023
Between:
Union Bank of India, R.P. Road Branch, Bunglow No.109, New No.1-7-252 to254 Oxford Street, Sarojini Devi Road, Secunderabad Near Parklane Centre, Secunderabad -500003 ..... Applicant
And
Mr. Karidi Vivekananda Reddy and others ...Defendants
To,
1. Mr. Vattipally Ravinder Reddy, S/o Venkat Reddy, Age Major, R/o H. No. 7/5/46, Plot No. 24 & 44, Venkateswara Colony, Mahaboobnagar, Telangana
2. Mrs. V. Vidyullatha, W/o Ravinder Reddy, R/o H.No.7/5/46, Plot No. 24 & 44, Venkateswara Colony, Mahaboobnagar,Telangana ..... Defendants No.2 & 3
Whereas O.A. No. 948 of 2023 was listed before Hon'ble Registrar on 10-09-2024.
Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of Rs.80,84,374.61 ps (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset otherthen properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on 21-10-2024 at 10.30A.M. failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this date of 13th September2024.
Signature of the Authorised Officer to issue Summons

## 10 యేండ్లలో ఒక్క కిలోమీటరు తవ్వలే..!

మొదటి పేజీ తరువాయి భాగం..

ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను విభజించుకొని నిధులను మంజూరు చేసి వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఎస్ఎల్‌బీసీకి సంబంధించిన మిషన్ రిఫర్‌కు అమెరికా నుంచి బేరింగ్ తెప్పించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని, రూ.42కోట్లను వెంటనే విడుదల చేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల పనులకు సంబంధం లేకుండా సాగునీరు వచ్చే లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఆర్అండ్ఆర్ ఫారెస్ట్ క్లియరెన్స్‌లను పూర్తి చేయాలని, నాగార్జున సాగర్ ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ పూర్తి చేయాలని, హైవే లెవల్ కెనాల్‌కు సంబంధించి భూ సేకరణ, అటవీ భూముల అనుమతికి ప్రత్యేక అంచనాలు రూపొందించి పంపించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు. నక్కలగండి, ఉదయసముద్రం, బ్యాలెన్స్ రిజర్వాయర్ వంటి ఒకేలైన్ ప్రతిపాదనలు పంపిస్తే తక్షణమే మంజూరు చేస్తామని, ఎస్ఎల్‌బీసీకి ప్రతి నెల అయ్యే బిల్లులు ఆర్థిక శాఖ నుంచి ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రపంచంలోనే అతిపెద్ద గ్రావిటి కెనాల్. 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వంనిర్లక్ష్యం కారణంగా ఆలస్యమై ప్రాజెక్టు వ్యయం రూ.4వేల కోట్లకు పెరిగిందన్నారు. తాము చేపట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో మిగిలిన 30 నుంచి 40 శాతం ప్రాజెక్టు పనులతో పాటు గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను సైతం పూర్తి చేస్తామన్నారు.

### అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయాలి

-అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



అచ్చంపేట నియోజకవర్గంలోని అచ్చంపేట మండలంలో నిర్మించతలపెట్టిన కళగంటి జలాశయంలో భూములు, ఇండ్లు కోల్పోయిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ క్రింద నష్ట పరిహారం చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు త్వరలోనే శంకుస్థాపన చేయాలన్నారు. అక్కారం గ్రామ శివారులో అచ్చంపేట, దేవరకొండ రహదారిపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. డిస్టిబ్యూటర్-1 డిండి బ్యాలెన్స్ రిజర్వాయర్ ద్వారా అక్కారం, గణపురం, మన్నెవారిపల్లి గ్రామాలతో పాటు 15 తండాలకు సాగునీరు అందించాలని ఆయన కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టులు, రోడ్లకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని, వాటికి మరమ్మత్తులు చేయించేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను పరిష్కరించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు ప్రాజెక్టుల సందర్శనకు విచ్చేసిన మంత్రులకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశానికి ఎంపీ రఘువీర్‌రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జై.భీం.రెడ్డి, బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, నర్సిరెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీయర్ ఇన్‌చీఫ్ అనిల్‌కుమార్, నల్గొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, చంద్రపవర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు మాధవి, శ్రీను, ఎస్ఎల్‌బీసీ నిర్మాణ సంస్థ జయప్రకాష్, పంకజ్‌గౌడ్, ప్రాజెక్టు ఇంజనీయర్ అధికారులు, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## మెడికల్ కళాశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

వసతి గృహం వరకు అప్పగిస్తామని, తరగతి గదులు, మిగతా భవనాన్న డిసెంబర్ చివరి నాటికి అపియాగించే విధంగా పనులు చేపడతామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. అంతకుముందు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించారు. వసతి గృహ భవనానికి అవసరమైన మరమ్మతులు త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని రోడ్లు భవనాలు శాఖ డి. ఈ ను ఆదేశించారు. భవనం మమ్మతులు పూర్తి అయితే భవనాన్ని ఉపయోగంలోకి తీసుకు రావచ్చని తెలిపారు. వసతి గృహం ముందు భాగం, పరిసర ప్రాంతం అంతా శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ డి. ఈ సీతారామ స్వామి, ఎ.ఈ, వనపర్తి డి.టి. మధు, కాంట్రాక్టరు కలెక్టర్ వెంట ఉన్నారు.

## తనయుడి చేతిలో తండ్రి హత్య..

మొదటి పేజీ తరువాయి భాగం..

పాటు ఇరుగు పొరుగు వారు వచ్చి చూసేసరికి తన కుమారుడు గొడ్డలి తీసుకుని ఇంటి నుంచి పారిపోయాడని వెంటనే ఆమె తన భర్తను చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మరణించిన విషయం తెలియజేయగా మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు.

## అరుణోదయ విమలక్కకు ఘన సన్మానం

**కల్వకుర్తి, సెప్టెంబర్20 ప్రభాతవార్త:** పీడిత ప్రజల హక్కుల కోసం గళమెత్తిన విప్లవ యోధురాలు విమలక్క అని తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో అరుణోదయ విమలక్కను శాలువాలతో ఘనంగ సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ అరుణోదయ ఉద్యమకారిణి, పోరాట వనిత ప్రజా సమస్యలపైన తన గళాన్ని వినిపించిన గొప్ప ప్రజా గాయని విమలక్క అని ఆయన అన్నారు. తన జీవితం మొత్తం బలహీన వర్గాల కోసం త్యాగం చేసిన విప్లవ యోధురాలు విమలక్క అని అన్నారు. విమలక్కను సన్మానించడం తాను గర్వంగా భావిస్తున్నానని ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తలకొండపల్లి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు గోపాల్ నాయక్, బీఆర్ఎస్ యువ నాయకులు సిద్దగోని నరేష్ తదితరులు ఉన్నారు.

## బీజేపీ సభ్యత్వ కార్యక్రమానికి అన్యూహ స్పందన

**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి బీజేపీ పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందని కల్వకుర్తి బీజేపీ సభ్యత్వ ఇన్‌చార్జి మచన్నగారి నరేందర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రాఘవేందర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి బీజేపీ కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బోడ నర్సింహ్మ అధ్యక్షతన బీజేపీ బూత్ అధ్యక్షుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల్లో అనూహ్య స్పందన వస్తోందని, స్వచ్ఛందంగా యువత పార్టీ సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సభ్యత్వ నమోదులో కార్యకర్తలు ముందుండి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బండెల రామచంద్రారెడ్డి, నాయకులు నరేడ్ల శేఖర్‌రెడ్డి, పాలకూర్ల రవిగౌడ్, బృంగి వివేకానంద, గంగాధర్, బాబీ, చందు, లక్ష్మినరసింహ తదితరులు ఉన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను సన్మానించిన గిరిజన నేతలు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి పాలక వర్గంలో మండల పరిధిలోని దేవదారి కుంట తండాకు చెందిన రాత్లావత్ కృష్ణకు చోటు కల్పించడంతో స్థానిక గిరిజన నాయకులు మార్కెట్ కమిటి డైరెక్టర్‌ను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. గిరిజన సామాజిక వర్గం నుంచి యువకుడైన కృష్ణను నియమించడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చినటువంటి పదవిలో బాధ్యతాయుతంగా పనిచేసే మంచి పేరును సంపాదించాలని వారు ఆకాంక్షించారు. రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని వారు సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అచ్చంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ తులసిరామ్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యక్షులు గోపాల్ నాయక్, సూర్యతండా మాజీ సర్పంచ్ బాలునాయక్, మాజీ సర్పంచ్ పర్వతాలు, మాజీ డిప్యూటీ సర్పంచ్ వాసురాం తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా దున్న విశ్వనాథంకు సన్మానం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అదే గ్రామానికి చెందిన దున్న విశ్వనాథం శుక్రవారం పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ పదవి విరమణ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతటి మల్లేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సాట ఖాసిం, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి పాలమూరు జిల్లా కో కన్వీనర్ మహేష్ మాదిగ, నాయకులు గుద్దటి బాలరాజు, బర్పటి రాజు, గణేష్, అనిల్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

**దేవరకద్ర, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** ఏరువాక కేంద్రం పాలెం నుంచి శాస్త్రవేత్తల బృందం పెద్ద రాజమూరు గ్రామంలో వరిచేలు సందర్శించి వరిలో కాండం తొలుచు పురుగు, బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణ చర్యలు వరి పొలంలో పోషకాల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు భరత్‌భూషణ్‌రావు, రామ్‌రెడ్డి, డి.విజయలక్ష్మి, దివ్యరాణి, వ్యవసాయ సహాయ సంచాలకులు యశ్వంత్‌రావు, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, విస్తరణ అధికారి హరీష్‌కుమార్, రైతులు సత్యనారాయణ, భాస్కర్‌రెడ్డి, అనంతయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యయాదవ్ జన్మదిన వేడుకలు

**కోయిల్‌కొండ, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** జిల్లా బిజెపి నేత సత్యయాదవ్ జన్మదిన వేడుకలను మండలంలోని గార్లపాడు గ్రామంలో శుక్రవారం మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సత్య యాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, నోట్‌బుక్కులు, పండ్లు పంపిణీ చేశారు. పేద ప్రజలసమస్యల కోసం నిరంతరం పోరాటం చేసి సత్యయాదవ్ జన్మదినవేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చాకలి శ్రీను, బాల్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడ్, చెన్నయ్య, వెంకటయ్య, చంద్రయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

# మహిళలకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి

◆ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ◆మహిళలకు మహాలక్ష్మీ గ్యాస్ ప్రొసిడింగ్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

**గద్వాల సెప్టెంబర్20 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్లు ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. 6209 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్ ను మహిళలకు అందజేశారుజ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సులు ప్రవేశపెట్టిన జరిగిందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల కోసం సీఎం నేడు రాష్ట్ర వ్యప్తంగా మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఉచితంగా ఆర్టీసీ బస్సు ను పథకము ను ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా గృహ జ్యోతి పథకంలో భాగంగా ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నామన్నారు. అదే విధంగా రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణ మాఫీరి చేయడం జరిగిందన్నారు.



మహిళలకు గ్యాస్ ప్రొసిడింగ్ పత్రాలు ఇస్తున్న బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి

నేడు మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ప్రొసీడింగ్ పత్రము అందజేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు, ఆడపడుచులకు కట్టెల పొయ్యితో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. కట్టెలపై వంట చేయడం వల్ల మహిళలకు కంటి సమస్యలు వస్తుండటంతో, దూర దిష్టితో ఆలోచించి గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు కూడా గ్యాస్ సిలిండర్లు, వంట చేసుకుని విధంగా ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం పత్రి ఒక్కరికి 500 రూపాయలు సబ్సిడీ ద్వారా గ్యాస్ సిలిండర్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. సబ్సిడీ అమౌంట్ను 48 గంటల్లో బీ బ్యాంకు ఖాతాలో 600 రూపాయలు జమ కావడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో కూడా సెక్రెటరీ, నాయకులు, ఇంటింటికి తిరిగి ప్రొసీడింగ్ కాగితాలు అందించడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే దసరా పండుగ కానుక గా పేద ప్రజలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను సీఎం ఇవ్వనున్నారని తెలిపారు. మహిళలు గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రము రాని మహిళలు ఎవరు కూబా అధైర్య పడకండని, ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజా పాలనలో నమోదు చేసుకోని ప్రభుత్వము మరొక్కసారి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశంను ప్రతి ఒక్కరూ సద్వానియోగం చేసుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాస్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణా రెడ్డి పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రమేష్ నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు గోపిరెడ్డి, ఆశోక్‌రెడ్డి హనుమంత్‌రెడ్డి, సత్యరెడ్డి, సత్య నారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సూరి, నర్సింహులు, కేశవరెడ్డి, నరేందర్‌రెడ్డి, రఘునాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# నిధుల కొరత సతమతమవుతున్న గ్రామ కార్యదర్శులు

### సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపిడిఓకు వినతి

**మూసాపేట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కృష్ణయ్య శుక్రవారం గ్రామాల కార్యదర్శిలు తమ సమస్యలు గ్రామ సిబ్బంది జీతాలు వచ్చే విధంగా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూసాపేట గ్రామ సెక్రెటరీ మహెందర్ వేముల గ్రామ సెక్రెటరీ సతీష్‌రెడ్డి చక్రాపూర్ గ్రామ సెక్రెటరీ కార్తీక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధుల కొరత ఉన్నందున గ్రామ పంచాయతీ నిర్వహణ సిబ్బందిజీతాలు చెల్లించలేకపోతున్నామని అందరు కార్యదర్శులు తమ సొంత డబ్బులను గ్రామ పంచాయతీ కోసం ఖర్చుపెట్టి తిరిగి డబ్బులు తీసుకోలేని పరిస్థితిలో ఉన్నామని అప్పులు చేసి గ్రామ పంచాయతీలో ఖర్చు పెట్టి డబ్బులు లేక మానసిక ఒత్తిడికి గురైపోతున్నాం. గ్రామ పంచాయతీలో ప్రస్తుతం ఉన్న నిధులను ఖర్చు చేసేందుకు వీల్లేకుండా గ్రామ సిబ్బంది జీతాలు తప్ప ఇలాంటి చెక్కులు గత సంవత్సరం నుండి చెక్కులు పాస్ కావడం లేదు అందువల్ల ఫార్మా కంపెనీ యాజమాన్యం క్రెడిట్ చేయడానికి వెనుకాడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల అవస్థలు మరి ఎక్కువయ్యాయి. సిబ్బంది జీతాలు లేక వాళ్ళు పని చేయలేపోతున్నారు పని చేయమని చెబితే ఎన్ని రోజులు ఇంకా చేయాలని నిలదీస్తున్నారు. వాళ్లని అడుక్కుని అనేకసార్లు నచ్చజెప్పి త్వరలోనే మీకు జీతాలు వస్తాయని పారిశుద్ధ్యం పనులను సరైన సమయంలో చేసి జాగ్రత్త వహిస్తూ పని చేయిస్తున్నామని గ్రామ పంచాయతీ



ఎంపిడిఓకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

పారిశుద్ధ్యం పనులు చేయడం లేదని సోషల్ మీడియాలో పేపర్లలో వదంతులు వస్తూనే ఉన్నాయి. కానీ కార్యదర్శి సమస్యల సిబ్బంది జీతాలగురించి ఎవరు మాట్లాడరు. ఓపిఎస్ గ్రామ కార్యదర్శి జీతాలు 8నెలల నుండి ఇవ్వలేదు నాజీతాలు లేక కుటుంబంగడవక ఇబ్బంది పడుతున్నారు. అయినాకూడా ప్రస్తుతం కార్యాచరణలో ఉన్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని తమ తెచ్చిన షెడ్యూల్ ప్రకారం విజయవంతం చేశాం15 రోజుల క్రితం కురిసినఅతి భారీ వర్షాల వల్ల గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యదర్శులు తమదైన శైలిలో పాత్ర వహించి గ్రామ ప్రజలకు భరోసా కల్పించామని ఇప్పటికైనా కనీసం ఐఎఫ్ఎంఐఎస్ నిధుల నుండి చెక్కులు పాసయ్యేందుకు కృషి చేయాలని మా సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికితీసుకెళ్లి కార్యదర్శులసమస్యలపైపునరాలోచించి పరిష్కారమయ్యే విధంగాపై అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మూసాపేట మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

# అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

◆ దేవరకద్ర మండల విద్యాధికారి ఎం. జయశ్రీ ◆ హెచ్ఎం వెంకటేశ్వర్లుకు ఘనంగా వీడ్కోలు

**దేవరకద్ర, సెప్టెంబరు20 ప్రభాతవార్త:** అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని దేవరకద్ర మండలవిద్యాధికారి ఎం. జయశ్రీ అన్నారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సుదీర్ఘకాలంగా పనిచేసే ఇటీవల బదిలీ అయిన వెంకటేశ్వర్లుకు వీడ్కోలు సభకు ఎంఈఓ జయశ్రీ, దేవరకద్ర స్కూల్ కాంప్లెక్స్ జిహెచ్ఎం కె.నాగేంద్రమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలను అన్ని విధాలుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు ప్రజల్లో ఆదరణ, గుర్తింపు, గౌరవం లభిస్తుందని అన్నారు. హెచ్ఎంగా 12 ఏళ్లుగా పని చేసిన జి. వెంకటేశ్వర్లు లక్ష్మీపల్లి, ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కె. నాగేంద్రమ్మ మాట్లాడుతూఅనునిత్యం విద్యార్థులఉన్నతికి, పాఠశాల ప్రగతికి కృషి చేసే ఉపాధ్యాయులకు ప్రజల మన్ననలు పొందుతారని అన్నారు. హెచ్ఎంగా విశేష సేవలందించిన వెంకటేశ్వర్లును



ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాగేంద్రమ్మ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లును పాఠశాలల ఉపాధ్యాయ బృందం తో కలిసి ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలోప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బాసిద్, కెకె శ్రీనివాస్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, కల్పన, విజయలక్ష్మి, మురళీధర్, ఆస్రఖాద్రి, శంకర్, సుజాత, మదన్, విద్యావాలంటీర్ వెంకట్రాములు గ్రామమాజీ సర్పంచ్ రాందేవ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగేష్‌గౌడ్, పాఠశాల కమిటి చైర్మన్ వాకిటిఅరుణ, గ్రామ పెద్దలురాంరెడ్డి, మన్యంకొండ, వెంకటేశ్వర్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి, చిన్నకాశన్న, రాములు, రమేష్ పాల్గొన్నారు.

# సాయిచంద్ అడుగుజాడల్లోనే ముందుకు..

- తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన బతికేఉన్నాడు - సాయిచంద్ జయంతి వేడుకల్లో గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ రజినీ

**జడ్చర్ల, సెప్టెంబర్20, ప్రభాతవార్త:** తన ఆటాపాటలతో కోట్లాది హృదయాలను కదిలించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి పోసిన సాయిచంద్ అడుగుజాడల్లోనే తాను ముందుకు సాగుతానని సాయిచంద్ సతిమణి, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ రజినీ అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లోశుక్రవారం కాల్వరాంరెడ్డిఅధ్యక్షతన జడ్చర్ల లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సౌజన్యంతో సాయిచంద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సాయిచంద్ 40జన్మదినం సందర్భంగా 40 మంది సాయిచంద్ అభిమానులు, కళాకారులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రక్తదాతలను సన్మానించి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రజినీ మాట్లాడుతూ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా తన పాటలతో ఊతం అందించినందుకు పాలమూరు బిడ్డగా తాను గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో సాయిచంద్‌కు బతికే ఉన్నాడన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులకు, కార్యక్రమం విజయవంతం కావడానికి ముందుండి కృషి చేసిన సామాజికవేత్త కాల్వరాంరెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మంజులాదేవి, దత్తు కుమార్, విక్కీ, ఫరీద్, చెన్నయ్య పాల్గొన్నారు.



రక్తదాతలను సన్మానిస్తున్న రజినీసాయిచంద్

# అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్

### ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి

### వెన్నాచెడ్ అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** అంగన్‌వాడి కేంద్రాలను సరిగా పర్యవేక్షణ చేయనందుకు గాను సంబంధిత సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. శుక్రవారం ఆమె గండీడ్ మండలం, వెన్నాచెడ్ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడి కేంద్రంలో కేవలం 6 మంది పిల్లలే ఉండడం, వారికి సైతం తగినంతగా పౌష్టికాహారం లేకపోవడం గమనించిన జిల్లా కలెక్టర్ కేంద్రాన్ని సొంత భవనంలో ఎందుకు నిర్వహిస్తున్నారని అంగన్‌వాడి టీచర్‌ను ప్రశ్నించారు. కాగా ప్రభుత్వం నుండి అంగన్‌వాడి కేంద్రాల రెంటు సకాలంలో రానందున సొంత భవనంలో నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడి టీచర్ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలను సూపర్‌వైజర్లు సరిగా పర్యవేక్షించడం లేదని గ్రామస్తులుజిల్లా కలెక్టర్‌దృష్టికి తీసుకురాగా సూపర్‌వైజర్లపై చర్య తీసుకోవాలని, షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆమె ఆదేశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి నీటి గుంతలలో దోమలు పెరగకుండా తయారు చేసిన ఆయిల్ బాల్స్ ను పరిశీలించారు. దోమల నివారణకు ఫాగింగ్ ఎప్పుడు చేస్తున్నారని ఆస్తి పన్ను ఎంత వసూలు అయిందని ఓటరు జాబితా సవరణతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, శుక్రవారం ప్రతి ఇంట్లో డ్రైడే నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి కృష్ణనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. కాగా గ్రామంలోప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నామని, దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామని, ఇల్లిల్లు తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోనిబాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. కాగా విద్యార్థులకు వడ్డించే పప్పు సరిగా లేకపోవడం గమనించి భోజనాన్ని నాణ్యతగా వడ్డించాలని ఆదేశించారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాలను తరచు తనిఖీ చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపిఓను గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెన్నచెడ్, సల్కర్‌పేట ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉప కేంద్రాలకు వచ్చే అవుట్ పేషంట్ల వివరాలు, ఫ్రైడే డ్రైడే నిర్వహణ, సీజనల్ వ్యాధులతో పరీక్షలకై వచ్చే వారి వివరాలను, మందులు, రిజిస్టర్ల నిర్వహణ తదితరాంశాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎంపిఓ నరెందర్‌రెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## అట్టహాసంగా 68వ ఎస్‌జీఎఫ్ పోటీలు

- అండర్14,17 కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్





బహుమతులు అందుకుంటున్న సెయింట్ ఆగ్నేస్ క్రీడాకారులు

**జడ్చర్ల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** జడ్చర్ల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. జడ్చర్ల అర్బన్ మండల్ లెవల్ అండర్ 14,17 పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో టోర్నమెంట్ కం సెలక్షన్స్- 2024-25 నిర్వహించగా మొత్తం 18జట్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. సెయింట్ ఆగ్నేస్ బాలుర ఖోఖో అండర్ 14 విభాగంలో రన్నర్‌గా, వాలీబాల్ అండర్ 14 పోటీల్లో విన్నర్‌గా, వాలీ బాల్ అండర్ 17 విభాగంలోనూ విన్నర్‌గా నిలిచాయి. ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్‌మేరీ ఇంద్రారాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులకు ఎంఈవో మంజులాదేవి, పెద్దగుట్ట పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి బహుమతులు అందజేశారు.

## ఆర్ఎంపీ సమీర్‌పై నిర్భయ చట్టం క్రింద కేసు నమోదు

◆ నాగర్‌కర్నూల్ సీఐ కనుకయ్య

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సహస్ర న్యూలైఫ్ ఆసుపత్రి యాజమాని ఆర్ఎంపీ వైద్యులు మహమ్మద్ సమీర్‌పై నిర్బయ చట్టంతో పాటు పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసినట్లు సీఐ కనకయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాడూర్ మండలం యాత్మతాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి స్వప్న అనే మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగికంగా వేధించినట్లు సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు. విచారణ చేపడుతున్నామని, త్వరలోనే నిందితుడినిఅరెస్ట్ చేస్తామని సీఐ పేర్కొన్నారు. నిందితుడు సమీర్ గురువారమే పారిపోయినట్లు సమాచారం. ఇది ఇలాఉండగా గురువారం ఆసుపత్రి ముందువివిధ రాజకీయ, పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోపెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించిన విషయమే విధితమే.



మాట్లాడుతున్న సీఐ కనుకయ్య

## మాజీ సర్పంచ్ మృతి బాధకరం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ ఎల్లయ్య మృతి బాధకరమని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ విచారం వ్యక్తం చేశారు. ఎల్లయ్య కుటుం బానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున అన్ని రకాలుగాఅండగాఉంటామనిఉప్పల వెంకటేష్ మనోధైర్యం కల్పించారు. నాయకులు దార మోని గణేష్, వట్టెపు కిశోర్, నరేష్‌గౌడ్, బుచ్చిబాబు, నాగరాజు, కృష్ణ, రామకృష్ణ, శేఖర్ ఉన్నారు.

## అడ్వెంచర్ క్యాంపు హిమాచల్ ప్రదేశ్‌లో శిక్షణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో వివిధ కార్యక్రమాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ జాతీయ అడ్వెంచర్ క్యాంపులో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె. ప్రవీణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాహస కార్యక్రమాలలో కొండ చరియ ప్రాంతాలలో సంభవిస్తున్న ప్రకృతి వైపరిత్యాల నుంచి ప్రజలను ఏ విధంగా సంరక్షించాలనే అంశంలో శిక్షణ పొందారని, నార్కడ హిమాచల్ ప్రదేశ్‌లో అత్యంత మంచు కురిసే ప్రాంతాలలో రాక్ క్లైమ్బింగ్, రివర్ క్రాసింగ్, రీఫిల్లింగ్, ట్రెక్కింగ్, క్యాంపింగ్ నాయకత్వ లక్షణాలలో శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆఫీసర్‌గా డా. రవిందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సుహాసిని పాల్గొన్నారు.

## వీపనగండ్లలో రైస్ మిల్లుపై ఆకస్మిక దాడులు

- గోపాల్‌రెడ్డి రైస్‌మిల్లుపై కేసునమోదు



**వీపనగండ్ల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం గోవర్ధనగిరిలోని గోపాల్‌రెడ్డి రైస్ మిల్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు ఎస్సై కే రాణి తెలిపారు. 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ ఇవ్వకపోగా అదే ఏడాది 4740 టన్నుల వడ్లను మిల్లుకు కేటాయించగా అందులో 2444టన్నుల వడ్లు మిల్లులో లేవని గుర్తించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీద్రోణాచారి, సాంబశివరావు ఎస్సైలు పి వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వనపర్తి డీఎం విశ్వనాథ్ తాసిల్దార్ డీటీలు వేణు తెలిపారు. శుక్రవారం రాత్రి 8.30గంటల సమయంలో రైస్ మిల్లుపై దాడి చేసి యజమాని లేకపోవడంతో కేసు నమోదు చేయాలని ఎస్సైకి తెలిపారు. మిల్లులో లేనట్లు గుర్తించిన వడ్ల విలువ సుమారు రూ.7కోట్ల98లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి నోటీసులు పంపించామని యజమాని స్పదించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రిన్సిపల్ కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఆదేశానుసారం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసు నమోదు చేయాలని పంపించినట్లు తెలిపారు.